హైదరాబాద్ వార్త



## మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

కెపిహెచ్‌బి కాలనీ, మే 6, ప్రభాతవార్త : మార్నింగ్ వాక్ చేస్తున్న ఓ మహిళ మెడ లోంచి గుర్తు తెలియని దొంగలు బంగారు గొలుసును అపహరించిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిజాంపేట్ సమీపంలోని కొలను రాఘవరెడ్డి గార్డెన్స్ వద్ద గల మహా లక్ష్మీ ఎస్టేట్‌లో నివసించే ఉప్పల శైలజ (48) ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. కాగా సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో కొలన్ రాఘవరెడ్డి గార్డెన్స్ చౌరస్తా నుండి వెళ్లే హై టెన్షన్ రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వెనుక నుండి వచ్చిన నిందితుడు మెడలోని ఆరు తులాల బంగారు గొలుసు మంగళసూత్రాన్ని అపహరించుకొని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తప్పిపోయిన బాలురును కుటుంబ సభ్యులకు అప్పగించిన అబిడ్స్ పోలీసులు

## తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలురు

గోషామహల్, మే6 ప్రభాతవార్త: మురళీధర్ బాగ్‌కు చెందిన ఇద్దరు బాలురు దారి తప్పి అబిడ్స్ ప్రాంతంలో తచ్చాడు తుండగా అబిడ్స్ పోలీసులు గమనించి ఇద్దరు బాలుర్లను ఎక్కడికి వెళ్తున్నారని అడి గారు. పసిబాలురు కొంత తడబడ్డారు. స్టేషన్‌కు తీసుకువెళ్లి ఇద్దరి బాలురను ఎక్కడి నుంచి వచ్చారని అడుగడంతో కొంత సమాధానం చెప్పలేదు. కొద్ది సేపు తరువాత తాము మురళీధర్‌బాగ్‌లో ఉంటామని చెప్పడంతో వెంటనే అక్కడి పోలీసులను పంపించారు. స్థానికంగా ఉండే శ్రీనివాస్‌కు ఇద్దరు చిన్నారులు బంధు వులను చెప్పడంతో పోలీసులు ఊపరి పీల్చుకున్నారు. శ్రీనివాస్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో ఇద్దరు చిన్నారులను అప్పగించారు. తప్పిపోయిన కొన్ని గంటలకే ఇద్దరు చిన్నారులను బంధువులకు అప్పగించి శభాష్ పోలీసు అనిపించుకున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని పోలీసులు కోరారు.

## చేపలు పట్టడానికి వెళ్లి ఇద్దరు బాలురు దుర్మరణం

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: చేపలు పట్టడానికి వెళ్ళిన ఐదుగురిలో ఇద్దరు ప్రమాదశాత్తు చెరువులో పడి దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన నగర శివార్లలోని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎర్రకుంటకు చెందిన మహ్మద్ అబ్దుల్ వహీద్ (14), అబూబాకర్ బిన్ సాహెద్ నహదీ (16), ఉస్మాన్ బిన్ సాహెద్ నహదీ (13), అబ్దుల్ హాఫీజ్ (24), సయ్యద్ వసీం (31)లు ఆదివారం ఉదయం చేపలు పట్టడానికి జల్‌పల్లి పెద్ద చెరువు వద్దకు వెళ్ళారు. వీరిలో ఉస్మాన్ బిన్ సాహెద్ నహదీ, మహ్మద్ అబ్దుల్ వహీద్‌లు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు వారి శవాలను వెలికి తీయడానికి గజ ఈతగాళ్ళు, అగ్నిమాపక సిబ్బందితో ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరకు సోమవారం సాయంత్రం వారి మృతదేహాలు నీటిపైన తేలియాడడంతో స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును నమోదు చేసుకొని పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నా.. మీకే నా ఓటు

## ప్రచారానికి వచ్చే అన్ని పార్టీలకు ఇదే హామీ

- అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు



ఎన్నికల వేళ.. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు తంటాలు పడుతున్నాయి. ఎన్నికల ప్రచారానికి వచ్చే అభ్యర్థులకు 'అన్నా మీకే నా ఓటు" అంటూ అందరికి అభయం ఇస్తున్నా.. అసలు ఓటరు మదిలో ఏముందో అర్థంకాక అయోమయానికి గురికావడం అభ్యర్థుల వంతవుతోంది.. ఎన్నికల ప్రచారానికి కాలనీలు, బస్తీలకు వచ్చే పార్టీల అభ్యర్థులందరికీ ఆదే హామీ ఇస్తున్న ఓటర్లు.. అసలు ఓటరు మదిలో ఏముందో అంతుచిక్కని వైనం ఏర్పాడు తోంది. ఎన్నికలకు మరో ఆరు రోజులే సమయం ఉండగా ఓటరు మదిలో ఏముందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

హైదరాబాద్ మే 6 ప్రభాతవార్త : రోడ్డు షోలు, బహిరంగసభలకు హాజరైన జనంతో నాయకులు ప్రత్యేకంగా మాట్లాడిస్తున్నారు. ఏ పార్టీ ఈ ఎన్నికల్లో గెలుస్తుంది? ఏ అభ్యర్థికి ఓట్లు ఎక్కువగా వస్తాయి?అని అడిగితే ఓటర్లు తెలివిగా సమాధానం చెబుతున్నారు. ముందుగా అడిగిన వ్యక్తినే వ్యక్తి గత, పార్టీ వివరాలు ఆరా తీసి అనంతరం ఆ పార్టీయే గెలుస్తుందని చెప్పి తప్పిం చుకుంటున్నారు. దీంతో ఓటరు నాడి పట్టుకో వడం కష్టంగా మారిందని నాయకులు వాపోతు న్నారు. లోక్‌సభ ఎన్నికల గడువు(ఈనెల 13వ తేదీ) సమీపిస్తున్న నేపథ్యంలో తమ శక్తియుక్తు లన్నీ కేంద్రీకరించి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థు లు, అనుచరులు గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలను ముమ్మురం చేస్తున్నారు. ఉదయమే బస్తీలు, కాలనీల్లో వెళ్లి ప్రచారం చేసినా రాత్రివేళ తమ పార్టీ పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ఓటరు మదిలో ఏముందో అర్థం కాక అయోమయానికి గురవుతున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు, అనుచరులు గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. ఏ పార్టీ ప్రచారం జరిగినా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతుండటంతో వారు ఎన్నికల్లో ఎవరికి మద్దతు తెలుపుతారో తెలియక నాయకులు, అభ్యర్థులు తికమక పడుతున్నారు.

### ఓటరు మదిలో ఏముందో?



సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా ఓటరు నాడి అర్థం కాక అయోమయంలో ఉన్నారు.

ఎన్నికలకు ఆరు రోజులే సమయం ఉండగా ఇంకా ఆయా పార్టీల్లో నాయకులు, అనుచరులు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు మారుతుం డటం అభ్యర్థులను కలవరపెడుతోంది. ప్రచారం కన్నా తమ పార్టీ నుంచి ఎదుటి పార్టీలోకి చేరికలు లేకుండా చూసుకోవడం, ఎవరన్నా పార్టీ మారితే అవతలి పార్టీ నాయకులు తమవైపు వచ్చేలా దృష్టి పెట్టడానికే ఎక్కువ సమయం సరిపోతోందని అభ్యర్థులు వాపోతున్నారు. మీవెంటే మేము అంటూ కలిసి తిరిగిన నాయకులు, కార్యకర్తలు మరుసటి రోజే కండువాలు మారుస్తుండటంతో ఎవరిని నమ్మి వ్యూహాలు పంచుకోవాలన్నా ఒకటి కి రెండుసార్లు ఆలోచించుకోవాలిస వస్తోందంటు న్నారు. గత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఏ పోలింగ్ బూత్‌లలో ఎన్ని ఓట్లు వచ్చాయి..? ప్రస్తుతం ఎన్ని వచ్చే అవకాశాలున్నాయి..? బస్తీల వారిగా తమ ఓటు బ్యాంకు ఎంత? సామా జిక వర్గాల వారీగా మద్దతు ఎలా ఉండవచ్చు? నాయకుల పార్టీల మార్పుతో కలిగే నష్టం తదితర అంశాలు నాయకులు, అభ్యర్థులు అంచనా వేస్తు న్నారు. ప్రత్యేకంగా కొందరికి బాధ్యతలు అప్పటించి ఎక్కడ బలంగా ఉన్నా.. ఎక్కడ బలహీనపడ్డాం వివరాలు సేక రిస్తూ అందుకు అను గుణంగా వ్యూహాలు మార్చు కుంటున్నా రు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వ్యూహా ప్రతివ్యూహా లకు పదును పెడుతున్నారు. ప్రచారానికి మిగిలిన సమ యాన్ని వృథాచేయకుం డా ప్రజల్లోకి వెళ్తున్నారు. అలాగే గెలు పోటములను ప్రభావి తం చేయగ లిగిన నాయ కులు, కార్యకర్తలతో టచ్‌లో ఉంటూ దిశానిర్దేశం చేస్తు న్నారు. ఇతర పార్టీలు, స్వ తంత్ర అభ్యర్థుల బలాబలాలపై ఆరా తీస్తూ పోల్ మేనేజ్‌మెంట్‌పై జోరుగా మంతనాలు సాగిస్తు న్నారు. అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల మంత్రాం గంపై దృష్టిసారించారు. పోలింగ్ తేదీ సమీపి స్తున్న కొద్ది ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎన్నిఓట్లు ఉం టాయి. అక్కడ ఏజెంట్లుగా ఎవరిని నియమిం చాలనే అంశంపై ముందే ఆరా తీస్తున్నారు. ఎప్ప టికప్పుడు అనుచరులతో క్షేత్రస్థాయిలో పరిస్థితు లను బేరీజు వేస్తూ అందుకు అనుగుణంగా నిర్ణ యాలను తీసుకుంటున్నారు. ఓటర్లను ప్రభావితం చేయ గలిగే నాయకులకే బాధ్య తలు అప్పగిస్తూ రోజూ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. తాము గెలిస్తే చేసే పనులను ఆయా నాయకులకు వివరించి ఓటర్లకు చేరవేసేలా దిశానిర్దేశం చేస్తున్నారు.



## హైదరాబాద్‌లో

ఆబిడ్స్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న సిఈవో వికాస్‌రాజ్, రోనాల్డ్‌రోస్,సిపి శ్రీనివాస్‌రెడ్డి

# ఓటింగ్ శాతం పెంచాలి

- 60నుంచి 65శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్‌శాతం పెరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయూలని అందుకు తప్పనిసరిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ న్నారు. సోమవారం ఎల్‌బి స్టేడియంలో రాపిడో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉచిత బైక్‌రైడ్ టాక్సీ రైడ్ కార్యక్రమానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్, సిపి కె.శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఆర్‌వో అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భం గా సిఈవో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఓటింగ్‌శాతం పెంచేందుకు గత రెండు మూడునెలలుగా ఓటరు అవగాహన కార్యక్రమూలు పెద్దఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. హైదరబాద్‌లో 60నుంచి 65శాతం ఓటింగ్ జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిహె చ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్‌శాతం పెంచడానికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ఇంటింటికి వెళ్ళి ఓటుహక్కు వినియో గించుకోవాలని ఓటు బాధ్యతను తెలిజేసి చైతన్యపరుస్తున్నారని, ఈసందర్భంగా ఓటింగ్ తేదీ పోలింగ్ తేదీతోపాటు ఓటరుగా గర్వపడదుతున్నాను ..అనే స్టిక్కర్‌ను కూడా ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గత పార్లమెంట్ ఎన్నికల కంటే ఎక్కు వ ఓటింగ్‌శాతం పెంచడానికి నగర ప్రజలు పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తు న్నట్లు పేర్కొన్నారు. సిపి శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకు నేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనదేశంలో ఉందని మే13న జరుగు పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ ఛీప్ అబ్దుల్ వకీల్, స్వీప్ అసిస్టెంట్ అధికారి నాగమణి, రాపిడో బిజినెస్ హెడ్ రోహిత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

**అబిడ్స్‌లో పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ పరిశీలించిన వికాస్ రాజ్**

పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని సోమవారం అబిడ్స్‌లోని అల్ సెయింట్ హైస్కూల్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్, రిజిస్ట్రేషన్, ఓటర్ల రిజిస్ట్రేషన్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ప్రతిఅంశాన్ని జాగ్రత్త గా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఏమైపోతున్నారో..?

## ఎందుకుపోతున్నారో.. ? ● మిస్సింగ్ కేసుల్లో నరకం ● కనబడుటలేదు



హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: నగరంలో మిస్సింగ్ కేసులు రోజు రోజుకీ అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖవారు సూచిస్తున్నారు. మిస్సింగ్ కేసులో పలు రకాల సంఘటనలు జరగవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఇంటికి దారి మరచిపోయి రోడ్ల మీద బికారిగా తిరిగే వాళ్ళు, తమ ఉనికిని మరచిపోయి మారుపేరుతో చలామణీ అయ్యేవారు, కుటుంబసభ్యుల మీద అలిగి వేరు ప్రాంతాల్లో రహస్యంగా నివసిస్తూ కాలం గడిపేవారు, తప్పిపోయిన అనంతరం పోలీసుల సాయం తీసుకోవడంతో పాటు సాధ్యమైనన్ని అవకాశాలని ఉపయోగించుకుని తిరిగి ఇంటిదారి పట్టేవారు, అనుమానాస్పద స్థితిలో మృతి చెందేవారు, ఏమయ్యారో ఆచూకీ తెలియకుండా ఉన్నవారు ఇలా పలు రకాల పరిస్థితు లకు లోనైన మిస్సింగ్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడిం చారు. ఎవరైనా ప్రాణాలు కోల్పోతే వారి కొరకు కుటుంబీకులు బాధ పడతారనీ, అదే మిస్సింగ్ కేసులో అంతకంటే పదింతలు ఆందోళన చెందుతారనీ పోలీసులు పేర్కొన్నారు. తెలిసిన వాళ్ళు ఎవరైనా తప్పిపోతే, తక్షణమే 1 0 9 8కు, లేదా 9440700906 వాట్సాప్ నెంబరుకు సమాచారం అందిం చడమే కాకుండా, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సిందిగా చెప్పారు. ఏదైనా మిస్సింగ్ కేసు నమోద యితే, వ్యక్తులు తప్పిపోయిన ప్రాంతాలలో ఉన్న సీసీ కెమేరాలు పరిశీలించడం దగ్గర నుంచీ ఆయా ప్రాంతాల స్థానిక పోలీసులను, రైల్వే పోలీసులను అప్రమత్తం చేస్తామని, మిస్సింగ్ పర్సన్ మానిటరింగ్ సెల్ ద్వారా తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతే కాకుండా టీ సేఫ్, మిస్సింగ్ యాప్ వంటి మొబైల్ అప్లికేషన్ల ద్వారా కూడా సత్ఫలితాలని పొందవచ్చని పోలీసులు తెలిపారు.

**12 గంటల్లో మిస్సింగ్ కేసు ఛేదించారు..** తాజాగా నమోదయిన మిస్సింగ్ కేసులో తప్పిపోయిన ఇద్దరు పిల్లల్ని 12 గంటల్లో ఛేదించిన వైనం ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇద్దరు బాలురు తప్పిపోయినట్లు ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. మురళీధర్ బాగ్ ప్రాంతానికి చెందిన 8ఏళ్ళ వినయ్ కుమార్, 10ఏళ్ళ చరణ్ కుమార్లు ఈ నెల 5వ తేది ఆదివారం ఉదయం ఆడుకుంటామని ఇంటినుండి బయటకు వెళ్ళి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన ఆ బాలుర మేనమామ శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ కెమె రాల ఫుటేజ్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. పన్నెండు గంటల పాటూ శ్రమించిన పోలీసు బృందం చివరకు వారు ఎక్కడున్నారో కనుక్కున్నారు. ఇద్దరు బాలురూ ఆటకు బస్సులో వెళ్తూ అనుకోకుండా మారేడ్ పల్లి వరకూ వెళ్ళిపోయారని గుర్తించిన పోలీసులు మారేడ్ పల్లి స్టేషన్‌కు సమాచారం అందివ్వగా, అప్పటికే ఆ ఇద్దరు పిల్లల్ని స్థానికులు అక్కడికి తీసుకొచ్చి ఉన్నారు. దాంతో పిల్లల్ని క్షేమంగా తమ ఇంట్లో అప్పగించినందుకు వారి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

**తప్పిపోయిన వృద్ధురాలికి అండగా నిలిచాడు..** ఇటీవలె మహ బూబ్ నగర్ జిల్లా నుంచి తన మనవడిని చూడడానికొచ్చిన వృద్ధురాలి మిస్సింగ్ కేసు ఒక ప్రైవేటు ఉద్యోగి సహకారంతో ఛేదించబడింది. మహబూబ్‌నగర్ చౌదర్ పల్లి గ్రామానికి చెందిన మణెమ్మ అనే వృద్ధురాలు, తన మనమడికి ఆరోగ్యం బాగోకపోవడంతో నగరానికి వచ్చింది. ఈ క్రమంలో ఒరకోజు రోడ్డు మీదకు వెళ్ళి దారి మరచిపోయింది. ఇహ తిరిగి తన వాళ్ళ దగ్గరకు వెళ్ళలేక, వాళ్ళు ఉండే ప్రదేశం కనుక్కోలేక తీవ్ర ఇబ్బందులు పడింది. అలా నాలుగు రోజులుగా రోడ్లమీదే తిరుగుతూ తిండికీ నిద్రకీ అవస్థ పడుతూ చివరకు మైత్రీవనం ప్రాంతానికి చేరుకుంది. అక్కడే ఉన్న ఎస్‌ఎఫ్‌ఏఎస్‌లో పనిచేసే సూపర్‌వైజర్ సయ్యద్ అజారుద్దీన్ ఒంటరిగా, దీనంగా ఉన్న మణెమ్మను గమనించి, ఆమె వద్దకు వెళ్ళి అసలు విషయం కనుక్కున్నాడు. ఆపదలో ఉన్న ఆమెను చేరదీసి కొద్ది రోజులు బాగోగులు చూసుకున్నాడు. అనంతరం తనకున్న పోలీసుల పరిచయాలతో ఆ వృద్ధురాలి కుమారుడి ఆచూకీ తెలుసుకుని ఆమెని వారి చెంతకు చేర్చాడు. ఈ జన్మలో తన కుటుంబీకులను కలుస్తానని తాననుకోలేదని, తనని చేరదీసిన సయ్యద్ అనే వ్యక్తికి కృతజ్ఞతలు తెలుపుకుంది. ఐతే సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ఉపాద్యాయిని కేసులో ఆమె ఆచూకీ ఇంకా లభ్యమవ్వలేదు. ఇటువంటి మిస్సింగ్ సంఘటనలు జరగకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పిపోయిన వారిని వెతికే పక్షంలో తామె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పోలీసులు సూచిస్తున్నారు.

# వేసవిలో విద్యుత్‌తో జర భద్రం

- వేసవిలో విద్యుత్‌తో జరభద్రం
- గోదాములు ఇండ్లలో జాగ్రత్తలు తప్పనిసరి
- అదనపు లోడ్ పడకుండా ఏర్పాట్లు
- షార్ట్ సర్క్యూట్ నివారణకు ముందస్తు చర్యలు
- రెండేళ్లకోసారి విద్యుత్‌తీగల తనిఖీ తప్పనిసరి



హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: ఎండలు మండి పోతున్నాయి.. ప్రతిఇంట్లో కూలర్లు, ఏసీల వాడకం ప్రాంరభమైంది. తక్కువ ధరలకే మార్కెట్‌లో లభిస్తున్న ఏసీలు,కూలర్లు,ఫ్రిజ్‌లను వాడేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ధర తక్కువగా ఉన్న విద్యుత్ పరికరాల వాడకంతో షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రికల్ నిపుణులు. వేసవికాలంలో షార్ట్ సర్క్యూట్స్ విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగు తుంటాయి. మండుతున్న ఎండలకు మంటలు చెలరేగే అవకాశాలు ఎక్కువేనని, టకాస్త జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చునని విద్యుత్‌శాఖ తనిఖీ అధికారులు తెలుపుతున్నారు. ఎండ కాలంలో గోదామలు,ఆఫీసులు,ఇళ్లలో విద్యుత్ ప్రమా దాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోల్సిందేనని పేర్కొంటున్నారు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువగా వాణిజ్య కేంద్రాలు, దుకాణాలు,బహుళ అంతస్తులు, గోదాముల్లో జరుగుతుంటాయి. మాల్స్,షాప్స్ మూసి వేసే ముందు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఏటా ఇళ్లు,కార్యాలయాల్లో విద్యుత్ వైరింగ్ సిస్టమ్ లైసెన్స్‌తీసుకున్న టెక్నిషి యన్లతో తనిఖీ చేయించుకుంటే ప్రమాదాలు నివారిం చవచ్చు. చాలా వరకు ఏళ్ల తరబడి విద్యుత్ తీగలు మార్చకుండా,స్వీచ్ బాక్స్‌లు పాతవే వాడుతుంటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదాలున్నాయని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

**వైరింగ్‌లో జాగ్రత్తలు..**

విద్యుత్ వైరింగ్ చేయించే టప్పుడు పూర్తిగా ఐఎస్ఐ ప్రమాణాల సామాగ్రినే ఉపయోగించాలి.ఏవస్తువు వాడేం దుకు ఎంత విద్యుత్ అవసరపడుతుందో తెలుసుకుని అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహ రణకు 10యాంప్స్ విద్యుత్ వినియోగించే చోట 20యాంప్స్ విద్యుత్‌బారం పడే పరికరాలు ఉపయోగిస్తే తీగలు కాలిపోయే అవకాశం ఉంది. ఇళ్లలో,ఆఫీసుల్లో అవసరమున్న మేరకు తగిన తోడ్ ఉన్న విద్యుత్ తీగలు ఉపయోగించాలి. నాసిరకం పరకరాలు వాడటం వల్ల విద్యుత్ వృధా అవుతుందని గుర్తించాలి. ఇన్సు లేషన్ పటిష్టంగాఉండేలా చూసుకోవాలి. ప్రతిఇంట్లో చిన్న వాణిజ్య భవనాల్లో న్యూట్రల్ పరికరాల కోసం సరిపడితంన ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి. భూమి లోని తేమ, ఉష్ణోగ్రతపై ఎర్తింగ్ సిస్టమ్ ఆదారపడు తోంది. ఎండాకాంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచే యాలంటే ఎర్తింగ్‌ను సరైన పద్ధతిలో ఉంచేందుకు నీరు దొడ్డు ఉప్పు ఉపయోగించాలి. గృహా లు,కార్యాలయాల్లో విద్యుత్ వాడేం దుకు పిన్ను లు, ప్లగ్‌లు, సాకేట్లను మాత్రమే ఉపయోగించాలి. ఒకే స్విచ్‌బోర్డ్‌కు ఎక్కువ ప్లగ్‌లు ఉపయో గించడంతో లోడ్ పెరుగుతుంది.క ఇళ్లలో కొత్తగా విద్యుత్ ఉపకరణాలు పెట్టేందుకు అవసరమైన కనెక్టడ్ లోడ్ ఉందో లేదో చూసుకోవాలి. అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు తర్వాతే ఏసీలు, వాటర్స్‌హీటర్స్, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రిల్ వస్తువులు ఉపయోగించాలి.

**లోడ్‌కు తగ్గట్టు విద్యుత్‌వాడకం ఉండాలి**

● విద్యుత్ కనెక్షన్ ఉన్నచోట లోడ్ అనుమతి వరకే వినియోగించాలి. పాత విద్యుత్ తీగలున్నా లోడ్ పెరిగితే విద్యుత్ ప్రమాదాలకు ప్రమాదం ఉంటుంది ● విద్యుత్ వైర్లు ఎండలో లేకుండా చూసుకోవాలి.ఎండ వేడికి తీగలపై ఉన్నరబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే అవ కాశం ఉంటుంది ● గృహాలు ఆఫీసుల్లో విద్యుత్ పనులు లైసెన్స్‌కలిగిన కాంట్రాక్టర్‌తో చేయిం చుకోవాలి. తరుచూ తనిఖీలు నిర్వహిస్తుండాలి ●ఎర్తింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.ఏదైనా షార్ట్‌సర్క్యూట్ జరిగితే ఎర్తింగ్ ఉండటం వల్ల ఎంసీపీ ట్రిప్ అవుతుంది ● విద్యుత్ వైరింగ్‌ను 4.చ.మిల్లీ మీటర్ మందం కలిగిన తీగలు, విద్యుత్ స్విచ్ బాక్స్‌లు మాత్రమే వినియోగించుకోవాలి ● అతుకులు లేని విద్యుత్‌తీగలు వాడాలి. అతుకులు గల విద్యుత్‌తీగలు వాడితే విద్యుత్ సరఫరాలో భారం పెరిగినప్పుడు స్పార్స్‌వచ్చి విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతాయి.



ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విహెచ్

## నగరంలో బైక్ దొంగల ముఠా అరెస్ట్..2లో

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు

2లో

## పోతురాజు వేషాధారుడు మృతి.. 2లో

# మోడీ పచ్చి అబద్దాల కోరు

**జస్టిస్ చంద్రకుమార్ ఆరోపణ**

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: ప్రపంచంలో ఏ దేశాది నేత అడనన్ని అబద్దాలను మన ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ఆడారని, మన ప్రధాని పచ్చి అబద్దాల కోరుని విశ్రాంత హైకోర్టు జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని నాశనం చేశారని, తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. సమాజ్ వాది పార్టీ–ఇండియా అలయన్స్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'లోక్‌సభ ఎన్నికలు–2024, రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో అత్యధికంగా ఉన్న హిందువుల ద్రోహి నరేంద్రమోదీ అని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయలేదని, దళారుల ప్రయోజనాలను కాపాడుతున్నారని, విపరీతంగా పెట్రోల్, డిజీల్ ధరలను పెంచారని, అదానీ, అంబానీల కోసం పాటు పడుతున్నారని ఆయన నిశితంగా విమర్శించారు. ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, సమన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 40 ఏళ్లు దాటిన మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న క్యాన్సర్ వ్యాధిని నిరోధించడానికి 40 సంత్సరాలు దాటిన ప్రతి మహిళా రొమ్ము, గర్భాశయం, అండాశయంను ప్రతి నెలకొకసారి తనిఖీ చేసుకుంటూ ఏడాదికొకసారి పరీక్షలు చేయించుకోవా లని కిమ్స్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కృపా బజాజ్ సూచించారు. అంతర్జాతీయ మదర్స్ డేని పురస్కరించుకుని సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మనకోసం, కుటుంబం కోసం, ఆరోగ్యం కోసం పరీక్షలు చేయించుకుంటే కొత్తగా ఏమైన గడ్డలు వస్తున్నది, పొట్టనొప్పి ఉబ్బరంగా ఉన్న వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి అంటే అందరు బయపడుతున్నారని, తమ జీవితాలు అయిపోయనట్లుగా బాధపడుతున్నారని, మొదటి దశ, రెండోవ దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే ప్రస్తుతం ఉన్న అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో నయం చేయవచ్చునని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా కాస్తున్న నేపథ్యంలో మనిషి శరీరంలో నీరు తగ్గిపోయే అవకాశం అందరిలో ఉంటుందని, రోజుకు మూడు లీటర్లు నీరు ఒకేసారి తాగకుండా కొద్దికొద్దిగా తాగుతూ కొబ్బరి నీరు, మజ్జిగ తాగాలని ఆమె సూచించారు.

## ఓటు హక్కును తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాలి

**తెలంగాణ ప్రవాసి సమాజ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుభాష్ అగర్వాల్**



ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రమాణం చేస్తున్న ప్రవాసి సమాజ్ సంస్థ ప్రతినిధులు సుభాష్ అగర్వాల్ తదితరులు

కంటోన్మెంట్, మే 6 ప్రభాత వార్త: ప్రజా స్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఈ ఎన్నికల్లో తమ విలువైన ఓటును తప్పని సరిగా సద్వినియోగం చేసుకొని మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని తెలంగాణ ప్రవాసి సమాజ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుభాష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. అది వారం రాత్రి మట్‌పోర్ట్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఓటు ప్రధాన్యతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రజా సస్వామ్యదేశంలో ఓటు ఎంతో విలువైందని, మద్యానికి, డబ్బులకు, మాయమాటలకు దాసోహం కాకుండా సమాజానికి ఉపయోగపడు వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కును తమ బాధ్యతగా గుర్తించి ఉపయోగించుకోవాలన్నారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగంచుకుంటామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆర్.ఎన్.గుప్త, అజయ్ అగర్వాల్, శ్రీ క్రిష్ణ శర్మ, అరుణ్ డకోటియా, నరేందర్ శర్మ పాల్గొన్నారు.

## ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి


పిఆర్‌సి కమిటి ప్రతినిధులను కలిసి టిఎన్‌జిఓ కేంద్ర,నగర నాయకులు జగదీష్,ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ

గన్‌ఫౌండ్రి, మే 6 ప్రభాతవార్త: ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని పిఆర్‌సి కమిటిప్రతినిధులను తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్రసంఘం, హైదరాబాద్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో కలిశారు. ఈమేరకు పిఆర్‌సి కమిటి చైర్మన్ శివశంకర్‌ను కలిసి ఉద్యోగుల డిమాండ్లను విన్నవించారు. మెడికల్ ఇన్వాల్యుడేషన్‌పై రిటైర్ అయిని ఉద్యోగుల పిల్లలకు కంపెన్సెనేట్ అపాయింట్మెంట్‌పై వెంటనే ఆదేశాలు జారీ చేయాలని, కంట్రిబ్యూటర్ పెన్షన్‌స్కీం ఎత్తివేసి, పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులైరేషన్ చేయాలని తెలంగాణ నాన్‌గజిటెడ్ కేంద్రసంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు లక్ష్మన్, కంద్రసంఘం నాయకులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణగౌడ్, కొండల్‌రెడ్డి, సిటిఅధ్యక్షులుకె.శ్రీకాంత్, డ్రైవర్ అసోసియేషన్ అద్యక్షులు, కార్యదర్శులు విన్నవించారు. కాగా ప్రైవేట్‌ఆసుపత్రిలో హెల్త్‌కార్డులు అమలు అయ్యేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని పిఆర్‌సి కమిటి చైర్మన్ శివశంకర్‌కు విన్నవించారు.

## భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

కెపిహెచ్‌బి కాలనీ, మే 6, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని శివమ్మా కాలనీకి చెందిన వందల మంది కాలనీ వాసులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, సిహెచ్.భాస్కర్, పాండుగౌడ్, నరసింహులు, సిద్దయ్య, జె.నరసింహులు, గిరి, యాదగిరి, సంగమేస్, అగ్రవాసు, బాలస్వామి, మహేష్, నాగేశ్వరరావు, దుర్గేష్, నవీన్‌కుమార్, సతీష్, బుచ్చయ్య, కనకరావు, పుష్పలత, శివలీల, రమేశ్వరి, ప్రమీల, సబితా, నందిని రేణుక, కృష్ణవేణి, బాలమని, సురేఖ, ద్రైపతి పాల్గొన్నారు.

**ఆల్విన్‌కాలనీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమ యువ నాయకుడు జి.ప్రదీప్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం కాంగ్రెస్ కండువ కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, ప్రేమ్ చంద్‌రెడ్డి, సతీష్, పృధ్వీ, ప్రభు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్కాపూర్ హత్యకేసులో నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, మే 6 , ప్రభాతవార్త: గుడిమల్కాపూర్ ప్రాంతంలో ఫోన్ దొంగతనానికి ప్రయత్నించి, ప్రతిఘటించిన పాదచారుడిని హత్య చేసిన నిందితుడిని స్థానిక పోలీసుల సహకారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం, గత మంగళవారం అర్థరాత్రి గుడిమల్కాపూర్ ప్రాంతంలోని ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండుగలు పాదచారుడు మొహమ్మద్ సానాఉల్లా(24) వద్ద ఫోన్ లాక్కునే ప్రయత్నంలో జరిగిన పెనుగులాటలో భాగంగా, వారిలో ఒకడు పాదచారుడిని కత్తితో పొడిచి హత్య చేశాడు. హత్య చేసిన వ్యక్తి టోలీచౌకీ ప్రాంతంలో చికెన్ షాప్‌లో పనిచేసే మహమ్మద్ అజీజ్ ఖురేషీ ఊరఫ్ సోహేలీ(19) గా పోలీసులు గుర్తించారు. అజీజ్ ఖురేషీకి గతంలో నేర చరిత్ర ఉందనీ, ఏడు వేరు వేరు కేసులో అతడు నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. అతని వద్ద నుండి రెండు కత్తులు, ఒక ద్విచక్రవాహనం, మూడు చారవాణులూ స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ కోసం హత్య చేసేముందు నిందితులు వాడిన ద్విచక్రవాహనం హోండా డియో బైక్ కెపిహెచ్‌బీ ప్రాంతంలో దొంగతనానికి గురైనదిగా తెలిపారు. గుడిమల్కాపూర్‌లో హత్య చేయడానికి మునుపు అదే రోజు మధ్యాహ్నం ఆరంఘర్ ప్రాంతంలో మరో సెల్‌ఫోన్ స్నాచింగ్‌కి నిందితుడు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## నగరంలో బైక్ దొంగల ముఠా అరెస్ట్

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: నగరంలో ద్విచక్రవాహనాలు దొంగిలించే ముఠాను పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేసిన వైనం సోమవారం చోటుచేసుకుంది. చోరీకి పాల్పడుతున్న సమయంలో ఇద్దరు నిందితులనీ గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితులను శ్యాం బిలాల్‌గా, రాసూరి సుఖేశ్వర్ ఊరఫ్ లోకేష్‌గా గుర్తించారు. వారి వద్దనుంచి 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాలు మధురానగర్, పొట్టి శ్రీరాములు నగర్, మీర్‌పేట్, రాజేంద్రనగర్, హుమయూన్ నగర్, పటాన్ చెఋవు, గుడిమల్కాపూర్, అబిడ్ రోడ్డు, సరూ ర్ నగర్, చాంద్రాయణగుట్ట తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీకి గురైనట్లు తెలిపారు. నగర కమీషనర్ కొత్తకోట శ్రీనివా సరెడ్డి స్పందించారు. నిందితులు శ్యాం, లోకేష్‌లు విలాసవం తమైన జీవనశైలికి అలవాటుపడి, నగరంలో బైక్‌లు, స్కూటర్ల దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## గాంధీ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

సికింద్రాబాద్, మే 6 ప్రభాతవార్త : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 11 సంవత్సరాల బాలికలో ద్వైపాక్షిక ఫియోక్రోమోసైటోమా కేసుకు లాపరోస్కోపిక్ బైలేటరల్ అడ్రినెలెక్టమీని విజయవంతంగా నిర్వహించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్, హెచ్ఒడీ డాక్టర్ కె. నాగార్జున నేతృత్వంలోని ఈ ఘనతను సాధించారు. నాందేడ్ నివాసి సంధ్య (11) అనియంత్రిత రక్తపోటు, తలనొప్పి, మైకము, చెమట, వాంతులతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. సిటీస్కాన్‌లో బైలేటరల్ అడ్రినల్ ఫియోక్రోమోసైటోమా ఉన్నట్లు గుర్తించారు. ఫియోక్రోమోసైటోమా అనేది అడ్రినల్ మెడుల్లా నుండి ఉత్పన్నమయ్యే బాల్యంలోని ఆసాధారణ కణితి. ఈ వ్యాధి 5లక్షల మంది పిల్లల్లో ఒక్కరికి మాత్రమే కనిపిస్తుంది. సుమారు 10శాతం ఫియోక్రోమోసైటోమా కుటుంబ సంబంధమైనది. 10శాతం కంటే తక్కువ పిల్లల్లో ద్వైపాక్షిక ఫియోక్రోమోసైటోమా వచ్చే అవకాశం ఉంటుంది. ఫియోక్రోమోసైటోమా అధిక రక్తపోటు ఉన్న పిల్లలలో 70 నుంచి 90శాతం వరకు కొనసాగుతుంది. సంధ్య తల్లి వైపు అత్త, మామా, తాతకు ఈ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 4న సంధ్యకు కుడి అడ్రినల్ సిరను కత్తిరించడం, లాపరోస్కోపిక్గా కణితిని విజయవంతంగా తొలగించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్, హెచ్ఒడీ డాక్టర్ కె. నాగార్జున, డాక్టర్ ఎస్. శ్రీనివాస్, డాక్టర్ అక్షిత్‌రెడ్డి, డాక్టర్ పి. మనోజ్‌రెడ్డి, డాక్టర్ హర్ష, ఆవుల వివిధ విభాగాలకు చెందిన వైద్యులు మురళీధర్, పద్మావతి, జార్జ్, అజయ్ మోహన్, విజయ్‌శేఖర్‌రెడ్డి, శాంతిశ్రీ, జాస్మిన్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావుల సహకారంతో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.



## ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఎమ్మెల్యే తలసాని దంపతుల పూజలు

బేగంపేట, మే 6,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయన సతీమణి స్వర్ణతో కల్సి పూజలు నిర్వహించారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంత్రి దంపతులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పండితులు వారిని వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు పలువురు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పూజలలో బీఆర్ఎస్ నాయకులు రాంగోపాల్‌పేట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, కొసికే కిషోర్, ఆంజనేయులు, ఆకుల హరికృష్ణ, నాగులు, మహేష్ , మహేందర్, అరుణ్ భట్, ఓదెల సత్యనారాయణ, జగదీష్ ప్రసాద్ వర్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలి

**నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి జీ.శంకర్‌రాజు**



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువాక్కు వినియోగించుకున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట, మే 6,ప్రభాతవార్త : ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ను ఉపయోగించుకోవాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకర్ రాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా తన ఓటు హక్కును జేఎన్‌టీయూ కూకట్‌పల్లి మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడతూ ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును తప్పని సరిగా ఉపయోగించుకోవాలని సూచించారు.

## లారీ ఓనర్స్ అసోసియేషన్ పోస్టర్ ఆవిష్కరణ


తెలంగాణ లారీ ఓనర్స్‌అసోయేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి,మంత్రి కొండా సురేఖ

బేగంబజార్, మే 6 ప్రభాతవార్త: ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలిపారు. ఈమేరకు ముఖ్యమంత్రి నివాసంలో తెలంగాణ లారీ ఓనర్ అసోసియేషన్ రూపొందించిన పోస్టర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖచేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వతేదిన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాంగ్రెస్ ఓటు వేసే విధంగా ప్రజలకు విన్నవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్నాథ్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్‌రామినేని, ప్రతి నిధులు ఎ.రామారావు, సాధిక్, దుర్గాప్రసాద్, గణేష్‌యాదవ్, చాంద్‌మమ్మద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ


విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మమ్మద్ వసీం,ఖాలీద్ నవీద్, జలాలుద్దీన్ జాఫర్,మమ్మద్ రిఆజ్

చార్మినార్,మే 6 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంఐఎంకు వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ తమ మద్దతును ప్రకటించింది. బజార్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రధాన కార్యదర్శి మమ్మద్ వసీం,రాష్ట్ర నాయకులు ఖాలీద్ నవీద్, అధికార ప్రతినిధి,మహ్మద్ నసీరుల్లా, రాష్ట్ర నాయకులు సయ్యద్ జలాలుద్దీన్ జాఫర్,జిహెచ్ఎంసి అధ్యక్షులు మమ్మద్ రియాజ్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంఐఎంకు మద్దతును ఇస్తున్నదని తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి : జంపనప్రతాప్


1వ వార్డు సంచారపురి కాలనీ వాకర్స్‌తో సమావేశమైన శ్రీగణేష్, జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, మే 6 ప్రభాతవార్త: లోక్ సభ, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం 1వ వార్డులోని సంచారపురి కాలనీ పార్కులో వాకర్స్‌ప్రతినిధులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేస్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్రి అమరేందర్ రెడ్డి, ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, ప్రభుగుప్త తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా గౌడ అభ్యర్థులు గెలిపించాలి

**అయిలి వెంకన్నగౌడ్**

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గౌడ అభ్యర్థులను పార్టీలకు అతీతంగా గెలిపించాలని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అన్నారు. సికింద్రాబాద్‌లో బిఆర్ఎస్ నంచి పోటీచేస్తున్న పద్మారావుగౌడ్, భువనగిరిలో బిజెపి నుంచి పోటీచేస్తున్న బూరనర్సయ్యగౌడ్‌లకు బడుగు బలహీనవర్గాలు ,దళితబహుజనులు ఐక్యమై గెలిపించాలన్నారు. పద్మారావుగౌడ్ ఎక్సైజ్ మంత్రిగా ఎన్నో ఏళ్లుగా మూతపడిన కల్లుదుకాణాలును తెరిపించి చెట్ల పన్ను రద్దు చేశారన్నారు. అలాగే బూర నర్సయ్యగౌడ్ తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ జేపీసీ ఏర్పాటు చేసి ప్రజల కోసం అనునిత్యం పరితపించే నాయకుడన్నారు. కావున వీరి గెలుపుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## 'అవినీతిలో కూరుకుపోయిన బిజెపి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవికుమార్, ఎస్.బాల్‌రాజ్ తదితరులు

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి దశాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని, ఈ దేశానికి పట్టిన ప్రధాని నరేంద్రమోదీ దుష్ట పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ పీపుల్స్ జెఎసి కమిటి కో–కన్వీనర్, ప్రముఖ విశ్లేషకులు కన్నెగంటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర సమితి ప్రచురించిన 'అవినీతి ఊబిలో కూరుకుపోయిన బిజెపి' అనే పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించడం ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు ప్రతిరూపం కులనిర్మూలన

**విశ్రాంత ఐపిఎస్ అధికారి చెన్నూరు అంజనేయరెడ్డి**


కులనిర్మూలన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయరెడ్డి, కె.కె.రాజా, సత్తయ్య

రవీంద్రభారతి, మే 6 ప్రభాతవార్త : భారతరత్న డా. బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల్లో ఒకటి కులనిర్మూలన అని విశ్రాంత ఐపిఎస్ అధికారి చెన్నూరి ఆంజనేయరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ద బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బిఎస్ఐ), తెలంగాణ శాఖ వారి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. బి.ఆర్.అంబేద్కర్ రచించిన కులనిర్మూలన గ్రంథావిష్కరణ, ప్రముఖ బుద్ధిస్ట్, రచయిత డి.చంద్రశేఖర్ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విశిష్ట అతిథులు ప్రముఖులు పిఎస్ ఎన్.మూర్తి, డా. బి.సత్తయ్య, కె.కె.రాజా, బిఎస్ఐ సభ్యులు ఎన్.నర్సింహ, సంజీవరెడ్డి, వరుణ్‌కుమార్, నల్లబాబు, యాదగిరిరావు, సురేష్ తదితరులతో డా. బి.ఆర్.అంబేద్కర్, డి.చంద్రశేఖర్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళుర్పించారు. అనంతరం డా. బి.ఆర్.అంబేద్కర్ రచించిన (అన్నిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్) కులనిర్మూలన ఆంగ్లమూలం; డి.చంద్రశేఖర్ అనువాదం; చక్రవర్తి సంపాదకత్వంలో ప్రచురించిన కులనిర్మూలన గ్రంథాన్ని ఆవిష్కరించి దీనిని 1969లో ప్రముఖ రచయిత బోయి భీమన్న మొదటిసారి తెలుగులోని అనువదించారని, ఆనాటి నుండి 20కిపైగా పునర్ముద్రణలు పొందినా మూల రచనలో డా. బి.ఆర్.అంబేద్కర్ వెలిబుచ్చిన భావాలను వెల్లడించడం అవసరమనిపించి ఈ గ్రంథాన్ని వెలువరించడం జరిగిందన్నారు. చివరిగా చంద్రశేఖర్ కుమారుడు, కుమార్తెలు ఆయన సంస్మరణలో బుద్ధభూమి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

## పోతురాజు వేషాధారుడు మృతి


మృతి చెందిన పోతురాజు దినేష్

బేగంపేట, మే 6, ప్రభాతవార్త : సికింద్రాబాద్ లష్కర్ బోనాలకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో అందరికీ తెల్సిందే. బోనాల జాతర సమయంలో శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయం వద్ద పోతురాజుల సందడి కన్పిస్తుంది. ఈ పండుగలో ఒళ్లంతా పసుపు పూసుకుని కళ్లకు నల్లటి కాటుక తో, నోట్లో నిమ్మకాయ పెట్టుకుని, చేతిలో కొరడా పట్టుకుని బోనం వెంట నడుస్తూ వివిధ రకాలైన విన్యాసాలు చేస్తుంటారు పోతురాజులు. సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద అమ్మ వారి జాతరలో పోతురాజు వేషం వేసే దినేష్ సోమవారం తుదిశ్వాస విడిచారు. దినేష్ మోండా మార్కెట్ పరిధిలో నివాసం ఉంటున్నారు. అతనికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న దినేష్ 6వతేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెల్సుకున్న స్థానికులు, అతని మిత్రులు సోషల్ మీడియాలో ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ పోస్టులు పెట్టారు. దినేష్ (పోతురాజు)గా గడచిన 21సంవత్సరాలుగా పోతురాజు వేషం వేస్తున్నాడు. అమ్మ వారు తనను పోతురాజు వేషం కట్టమని చెప్పిందని, అప్పటి నుంచి ఇలా చేస్తున్నానని చెప్పేవాడు. దినేష్ చక్రవాకం తో పాటు పలు టీవీ సీరియల్స్‌లో కూడా నటించాడు. దినేష్ పోతురాజు మృతితో లష్కర్ ప్రాంతంలో ఆయన్ను అభిమానించే మిత్రులు, ఆత్మీయులు తమ సంతాపాన్ని తెలియజేసారు.

## బీరప్ప ఆలయం సమీపంలో వ్యక్తి మృతి



బేగంపేట, మే 6, ప్రభాతవార్త : బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నానగర్ చౌరస్తా బీరప్ప ఆలయం సమీపంలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన జరిగింది. ఈ సంఘునటపై అన్నానగర్‌కు చెందిన బి.మహేందర్ సెంట్రింగ్ పనులకు వెళ్తుండగా గుర్తించాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 2వతేదీన స్థానికంగా ఉండే మహేందర్ సెంట్రింగ్ పనులకు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బీరప్ప ఆలయం సమీపంలోని అన్నానగర్ చౌరస్తాలో పడిపోయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడన్నారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని 108కి సమాచారం ఇచ్చామన్నారు. అతన్ని పరిక్షించిన 108 సిబ్బంది అతను చనిపోయినట్లుగా చెప్పారన్నారు. మృతుడి వయసు సుమారు 40నుంచి 45సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.5అడుగులు ఉంటాడని, ఒంటిపై ఫ్యాంటు ఉందన్నారు. మృతుని గురించి స్థానికంగా విచారించగా గడచిన 4నెలలుగా బీరప్ప ఆలయం వద్దనే పడుకుంటున్నాడని, కూలీ పనులకు వెళ్తుంటాడని చెప్పారన్నారు. మృతుని ఆచూకి తెల్సిన వారు బేగంపేట పోలీసులను సంప్రదించాలని సబ్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు తెలిపారు.


## బిజెపిని ఎండట్టేందుకు రైతాంగం సిద్దమవ్వాలి

**సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు**


ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయని బిజెపినని మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఎండగట్టేందుకు రైతాంగం సిద్దం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలభారత నాయకులు డాక్టర్ విజ్జు కృష్ణన్, రాయల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు సుంకెట అవినాశ్‌రెడ్డి, టి.సాగర్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉన్న పదిసంవత్సరాల కాలంలో రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి కూలీలు, 4.24లక్షలమంది అత్మహత్యలు చేసుకున్నాంన్నారు. వీటి నివారణకు ఈపదిసంవత్సరాల కాలంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. కరోనా కాలంలో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 13నెలలపాటు సుదీర్ఘ పోరాటం జరపాల్సిన వచ్చిందన్నారు. అలాగే కనీస మద్దతు ధరచట్టం చేస్తామని, రుణమాఫీ చేస్తామని విద్యుత్ సరవణ బిల్లును రైతులతో మాట్లాడకుండా పార్లమెంట్‌లో పెట్టమని చెప్పినప్పటికి వాటిని అమలు చేయలేదన్నారు. కావున ఈపార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాగర్, వి.ప్రభాకర్, విస్సా కిరణ్, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

## వైశ్యయూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నారామయ్యగారి అరుణ్‌కుమార్


వైశ్యయూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న చిన్నారామయ్యగారి అరుణ్‌కుమార్

చిక్కడపల్లి,మే 6 ప్రభాతవార్త: భాగ్యనగర్ వైశ్యయూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నారామయ్యగారి అరుణ్‌కుమార్ సోమవారం ప్రమాణస్వీకారంచేశారు. సహకార్యవర్గ సభ్యులతో కలిసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడంతో పాటు ప్రభుత్వ విద్యాలయాలకు అవసరమైన వస్తుసామాగ్రిని అందించడంతో పాటు లాప్‌టాప్‌లు బహుకరించడం జరుగుతుంద న్నారు. ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిన టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జన్నార్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ సందేశం పంపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీవిఎన్.రాజు కీలక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎర్రంశెట్టి రవికాంత్, పూర్వ అధ్యక్షుడు రాహుల్, డివిఎస్‌పి.గుప్తా, దివ్వెల మురళీ, కస్తూరి శివప్రసాద్ పాల్గొనగా ప్రాజెక్టు చైర్మన్ మర్యాద రాజేంద్రప్రసాద్, నూకల నాగరాజు, పర్యవేక్షణ చేయగా కూర ధీరజ్ వందన సమర్పణ చేశారు.



కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణతో బేటీ అయిన శ్రీగణేష్

## నామినేషన్ ఉపసంహారించుకున్న మాజీ కేంద్రమంత్రి సర్వే

అడ్డగుట్ట, మే 6 ప్రభాతవార్త: కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ గత కొన్ని రోజుల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌తో అలకలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సర్వే నామినేషన్ దాఖలు చేశారు. అధిష్టానం ఆదేశాల మేరకు సర్వే తమ నామినేషన్ పత్రాలను ఉపసంహారించుకు న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేం ద్ర మంత్రిగా, రెండు సార్లు ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన సర్వే సత్య నారాయణను కంటోన్మెంట్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ సోమవారం మహేంద్రహిల్స్‌లోని సర్వే నివాసంలో కలిసి తన గెలుపుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సర్వేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్, సంకి రవిందర్ బాబు, సంకి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిక



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డిల సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన జీ.ఎన్.వెంకట్ తదితరులు

కంటోన్మెంట్, మే 6 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన ప్రముఖ నాయకుడు జీ.ఎన్. వెంకట్‌తో పాటు 60 మంది యువకులు ఆదివారం రాత్రి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌ఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ అభ్యర్థి నివేదితల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బిఆర్ఎస్ కండువకప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డివిజన్ అధ్యక్షుడు అకుల హారిక్రిష్ణ, నాయకులు నారాయణ, రాము, చంటీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



హన్మంత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

నిజాంపేట్, మే 6 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసి ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిజాంపేట్ బస్‌స్టాప్ దగ్గర ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో భారీ గజమాలతో సత్కరించి, పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కొలన్ హన్మంత్‌రెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు, కొలన్ హన్మంత్‌రెడ్డి, కె.ఎస్.ఆర్ అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షల తెలిపుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మందలించారని మహిళ అదృశ్యం



తార్నాక, మే 6 ప్రభాతవార్త : సెల్‌ఫోన్ మాట్లాడుతున్న భార్యను మందలించడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై.ఎం.ఎ వహీద్ కథనం ప్రకారం. మాణికేశ్వరీనగర్ బస్తీకి చెందిన ఎండి.షర్ఫుద్దీన్ ఏసి మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఎండి షాహిన్(28)తో గతం కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యపై తరుచు అనుమా నంతో ఆమెను వేదిస్తుండటంతో ఆమె గత కొంతకాలంగా తల్లివద్దనే ఉంటుంది. ఇటీవల వారితో మాట్లాడి ఆమెను భర్త సముదాయించి ఇంటికి తీసుకొచ్చాడు. ఈ నెల 4 ఉదయం ఆమె ఫోన్‌లో ఎవరితోనే ఎక్కువ సమయం మాట్లాడింది. దీంతో ఆగ్రహించిన షర్ఫుద్దీన్ ఆమెను మందలించాడు. దీంతో ఆమె మనస్థాపంతో పిల్లలను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె భర్త షర్ఫుద్దీన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### తెలంగాణ ప్రదేశ్ లీగల్‌సెల్ కన్వీనర్‌గా ఎస్.దినేష్

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: తెలంగాణ ప్రదేశ్ లీగల్ సెల్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది ఎస్.దినేష్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం తెలంగాణ ప్రదేశ్ లీగల్‌సెల్, హ్యూమన్‌రైట్స్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ దినేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ తనమీద నమ్మకంతో తనకు ఈబాధ్యతలు అప్పగించిన అధినేత రాహుల్‌గాంధీకి, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి, పొన్నం అశోక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## రోహిత్ వేముల బలవన్మరణపై విచారణ చేపట్టాలి

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులను శిక్షించాలని, నేర విచారణ అనేది నిందితులను రక్షించడానికి చేశారే తప్ప శిక్షించడానికి చేయలేదని పలువురు నాయకులు ఆరోపించారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ-L.B. నగర్ సర్కిల్-4 GHMC
సంక్షిప్త టెండర్ ప్రకటన
నిట్ నెం.01/EEC-4/LBNR/GHMC/01-04/2024-25, తేది: 06.05.2024, పని పేరు: సాధారణ ఎన్నికలకు HOP-2024 కొరకు 07 మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ వార్డ్ నం.15 వనస్థలిపురం, 16 హస్తినాపురం, 17 చంపాపేట్, 18 లింగోజీగూడలలో ఇతర ప్రతిపాదనలు మరియు కనీస, ప్రాథమిక సదుపాయాల ఏర్పాటు 4 సం.లు, అంచనా మొత్తం: 17.65 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేది/ సమయం: 07.05.2024 మ.3.00 గం., 08.05.2024 మ.3.00 గం., ప్రైస్ బిడ్ తెరుచు తేది: 08.05.2024 మ.3.15 గం., అధికారి పేరు, చిరునామా, సెల్ నం. శ్రీ డి. కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B నగర్ సర్కిల్-4, GHMC, (M): 9989094468. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No.12046-PP/CL/Advt/1/2024-25, తేది: 06.05.2024 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC


## ఇన్‌స్టాల్‌మెంట్‌లో బైక్ తీసుకొని రాజాసింగ్ నెంబరిచ్చాడు

**లోన్ కట్టమంటూ వరుస ఫోన్లు.. మండిపడ్డ ఎమ్మెల్యే**

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త: రాజకీయ నాయకులు పబ్లిక్ సర్వెంట్లే కదా అనే సూక్తిని పాఠించిన ఒక ప్రభుదుడు తాను వడ్డీ కట్టాల్సి న బ్యాంకుకు ప్రముఖ రాజకీయవేత్త ఫోన్ నెంబర్ ఇచ్చి చర్చల్లో నిలిచాడు. ఇన్‌స్టాల్‌మెంట్‌లో బైక్ తీసుకున్న వ్యక్తి, తన నెంబరుకి బదులు ఎమ్మెల్యే రాజాసింగ్ ఫోన్‌నెంబరు ఇచ్చి యాక్సిస్ బ్యాంకును తప్పుదోవ పట్టించాడు. వివరాల్లోకి వెళ్తే, షేక్ మహమ్మద్ అనే వ్యక్తి తన పేరుమీద బైక్ తీసుకున్నాడు. అందుకుగానూ యాక్సిస్ బ్యాంకులో లోను తీసుకున్నాడు. రికవరీ కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందనే ఉద్దేశంతో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నెంబర్‌ను సదరు బ్యాంకుకి ఇచ్చాడు. దాంతో లోన్ కట్టాలంటూ యాక్సిస్ బ్యాంకు నుంచి రాజాసింగ్‌కు తరచూ ఫోన్‌కాల్స్ చేస్తున్నారు సంబంధిత టెలీకాలింగ్ అధికారులు. షేక్ మహమ్మద్ అనే వ్యక్తి మీ నెంబరిచ్చారని, బైక్ తీసుకున్నందుకు ఈఎంఐ కట్టమంటూ ఆయనను అడిగారు. ఈ వ్యవహారంపై రాజాసింగ్ మండిపడ్డారు. తన నెంబరిచ్చిన షేక్ మహమ్మద్ ఎవరో తనకు తెలియదంటూ ఫైరయ్యారు.

## కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రెడ్డి సంఘం మద్దతు



తెలంగాణ రెడ్డి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, చిత్రంలో పాటి యాదిరెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, హరినాథ్‌రెడ్డి

హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రెడ్డి సంఘం మద్దతు ప్రకటించింది. సోమవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా పోరాడుతున్న సాధ్యంకాని రెడ్డి కార్పొరేషన్‌ను అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రెడ్డిల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి అన్ని కులాల మాధిరిగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం హర్షనీయమని పేర్కొన్నారు. అందుకు కృతజ్ఞతగా లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సహకరిస్తామని ప్రకటించారు. రెడ్డి సంఘం నగర మహిళా విభాగం అధ్యక్షురాలు దేవిరెడ్డి విజితారెడ్డి మాట్లాడుతూ రెడ్డి పేరు పెట్టుకొని రెడ్డి ఓట్లతో ఎంపిగా, ఎమ్మెల్యేగా గెలిచిన కిషన్‌రెడ్డి రెడ్డి సమాజానికి ఏమీ చేయలేదని విమర్శించారు. ఆయన కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉండి కనీసం ఒక్క అటెండర్ ఉద్యోగం కూడా ఎవ్వరికి ఇవ్వలేదని ఆరోపించారు. అందుకే కిషన్‌రెడ్డి తన మొహం చూడకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని చూసి బిజెపికి ఓటు వేయాలని కోరుతున్నారని ఎద్దేవాచేశారు. తెలంగాణ రెడ్డి సంఘం సలహాదారుడు ఎస్.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మోజారిటీతో గెలిపించి సిఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు పాటి యాదిరెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, యెన్నపెల్లి లింగారెడ్డి, సి.బాలవర్ధన్‌రెడ్డి, దేప తిరుపతిరెడ్డి, దేవిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ, బిజెపి సమన్వయంతో పనిచేస్తాయి

**సికింద్రాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్**



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ముషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: బీజేపీతో బంధం ఈనాటిది కాదని, గతంలో వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో కూడా టీడీపీ, బీజేపీ సమన్వయంతో పని చేశాయని, ఇప్పుడు కూడా అదే విధంగా పనిచేస్తాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని హైదరాబాద్ జిల్లా టీడీపీ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల వల్ల తెలంగాణ ఎంతో నష్టపోయిందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన నాయకత్వంలో ఏపీ భవిష్యత్తు బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చింతల రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో కిషన్‌రెడ్డి తెలంగాణకు ఎన్నో పథకాలు తెచ్చారని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో తెలుగుదేశం పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. హైటెక్‌సిటీ సైబర్‌టవర్స్, రింగురోడ్డు, ఇంటర్‌నేషనల్ బిజినెస్ స్కూల్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చంద్రబాబు నాయుడు చేపట్టారని అన్నారు. మాజీ శాసనసభ్యులు కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. టీడీపీ బీజేపీ పొత్తు ఖరారయిన నాటి నుండి స్థానికంగా మేము మా మిత్ర పక్షమైన బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపుకోసం స్థానిక బీజేపీ నాయకులతో కలసి పని చేస్తున్నామని తెలిపారు. సాయిబాబా మాట్లాడుతూ టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అందరం మన శాయశక్తుల కృషి చేసి, మన మిత్ర పక్షం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, శ్రీనివాస్ నాయుడు, వల్లారపు శ్రీనివాస్, శ్రీపతి సతీష్, అశోక్, ఎం.కే.బోసు, కట్టరాములు, పుష్పాల బాలకృష్ణ, ప్రదీప్‌గౌడ్, ఎస్.ప్రకాష్, భాను, కిరణ్, విజయ్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను విక్రయిస్తున్న బిజెపిని ఓడించాలి

**వై.నాగన్నగౌడ్ పిలుపు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వై.నాగన్నగౌడ్

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బడా కార్పోరేట్లకు దేశ సంపదను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న బిజెపిని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి దేశాన్ని నిర్మించిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్ పిలుపునిచ్చారు. కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు తమ ఓట్లు ద్వారా తరిమి కోట్లాలని ఆయన కోరారు. సోమవారం ఐఎన్‌టియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.బి.విజయ్ కుమార్, కార్యదర్శులు ఎస్.నర్సిసింహారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలలో లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని, ఇప్పటికి లాభాల్లో నడుస్తున్న సంస్థలను మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వాటిని ప్రైవేటు పరం చేస్తున్నదని ఆరోపించారు. ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కార్మికుల సమస్యలపై విజ్ఞప్తి చేయడం జరిగిందని, సిఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఐఎన్‌టియుసి అనుబంధ కార్మిక సంఘాల కార్మికులు, సంఘటిత, అసంఘిటిత కార్మికులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామన్నారు.

## నోటుకు, మందుకు, బిర్యానికి అమూల్యమైన ఓటును తాకట్టుపెట్టొద్దు

**అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్**



ప్రసంగిస్తున్న అఖిలభారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అఖిలభారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్‌లు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటుకు, మందుకు, బిర్యానికి అమూల్యమైన ఓటును తాకట్టుపెట్టవద్దని కోరారు. రాజకీయ వ్యాపారులపై, దోపిడీదారులపై, ఓటు తూటాలు పేలాలని అన్నారు. మీకు నచ్చిన వారికి మీ ఓటును వేసి మంచి నాయకుడిని ఎన్నుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రలోభాలకు లోనుకాకుండా విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మనం వేసే ఓటు ఐదేళ్ళ పాలనకు, దేశాభివృద్ధికి సంబంధించి విషయమని, దేశభక్తి కలిగి దేశాన్ని అభివృద్ధిపథకంలో నడిపించగలిగే వారిని మన దేశాన్ని ప్రపంచం ముందు ఉన్నతంగా నిలిపే వారిని మాత్రమే గెలిపించాలని కోరారు. నిజమైన ప్రజాసేవకులనే గెలిపించాలని, అందుకోసం ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి శ్రీనివాస్, జాతీయ నాయకుడు చింతకింది జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కొంపల్లి, మే 6, ప్రభాతవార్త : బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి, బైరాన్ చెరువులో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.అంజి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నందు చెత్త సేకరణ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే చెత్త సేకరణ నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాచుపల్లిలోని బైరాన్ చెరువు వద్దకు వెళ్ళగా, చెరువు నందు ఒక గుర్తు తెలియని సుమారు 35-40 సంవత్సరాలు గల వ్యక్తి చనిపోయి, నీటిపై తెలియాడుతున్నాడు. అతని ఒంటిపై బొల్లి మచ్చలు ఉన్నట్లు, పసుపు రంగు చొక్కా, బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్ ధరించినట్లు తెలిపారు. అంజి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం హాస్పిటల్‌కు పంపించి, దర్యాప్తు చేస్తున్నారు.

## దూసుకుపోతున్న మజ్లిస్ ప్రచారం



బహదూర్‌పుర నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ

చార్మినార్, మే 6 ప్రభాతవార్త : చార్మినార్,బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలో మజ్లిస్ ఎన్నికల ప్రచారం దూసుకుపోతుంది. ఎన్నికల ప్రచారానికి మరో ఆరు రోజుల గడువు ఉండటంతో ఎంఐఎంకు కంచుకోటగా ఉన్న చార్మినార్,బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలపై ఎంఐఎం ప్రత్యేక దృష్టిని పెట్టింది.ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రత్యర్థులకు అందని విధంగా ఎఐఎంఐఎం ప్రతీ రోజు రోడ్ షోలు,ఇంటింటి ప్రచారం,కార్నర్ మీటింగులతో పాతబస్తీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్రయత్నం చేస్తున్నది. ఎంఐఎం అధ్యక్షులు,హైదరాబాద్ పార్లమెంట్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ గతంలో ఎన్నడు లేని విధంగా ప్రచారాలు, బహిరంగ సభలలో పాల్గొంటు నాయకులు,కార్యక ర్తలను ఉత్తేజపరుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గంలో ఎంఐఎంకు 49103 ఓట్లు,బిజెపికి 26250 ఓట్లు, కాంగ్రెస్‌కు 10899 ఓట్లు,బిఆర్ఎస్‌కు 8874 ఓట్లు,బిఎస్‌పికి 272 ఓట్లు,బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఐఎంకు 89451 ఓట్లు,బిజెపికి 11621 ఓట్లు,కాంగ్రెస్‌కు 14448 ఓట్లు, బిఆర్ఎస్‌కు 22426 ఓట్లు లభించాయి. చార్మినార్, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంఐఎం పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయం విధితమే.రెండు నియోజకవర్గాలలోని పద మూడు డివిజన్‌లలో జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ అభ్యర్థులే గెలు పొందారు.ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికర్ అలీ,మహ్మద్ ముబీన్‌తో పాటు కార్పొరేటర్లు పార్టీ విజయం కోసం విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

**చార్మినార్ బిజెపిలో నాయకుల మధ్య విభేధాలు**

చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి నాయకుల మధ్య తీవ్ర విభేధాలు ఉన్నాయి. ప్రచారం విషయంలో నాయకులు అంటి అంటనట్టుగా ఉంటున్నారు. మరో ఐదు రోజులు గడిస్తే ఎన్నికల ప్రచారం అయి పోతుందని ఆలోచనలో నాయకులు ఉన్నారు. బిజెపి కోసం ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న నాయకులకు సరైన గుర్తింపు లభించటం లేదని చార్మినార్ నియోజకవర్గానికి చెందిన కొంత మంది నాయకులు వాపోతున్నారు. నాయకుల మధ్య కొనసాగుతున్న విభేదాలు కారణంగా చాలా మంది నాయకులు సైలెంట్‌గా ఉంటున్నారు.

**ప్రచారానికి దూరంగా కాంగ్రెస్,బిఆర్ఎస్ నాయకులు**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చార్మినార్,బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన చాలా మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు,బిఆర్ఎస్ నాయకులు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. చార్మినార్, బహదూర్‌పుర నియోజకవర్గాలలో బిఆర్ఎస్ ప్రచారం నామ మాత్రంగానే కొనసాగుతున్నది.అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు డిపాజిట్ కూడ దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే చార్మినార్, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో పాల్గొనటం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం జరుగుతున్న ఎన్ని కల్లో కాంగ్రెస్ నాయకులలో కనిపించటం లేదు.చార్మినార్, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంఐఎం ప్రచారంలో దూసుకు పోతున్నది.

## రాంగ్ రూట్లో వస్తే శిక్షతో పాటు జరిమానాలు



రాంగ్ రూట్‌లో వచ్చిన వారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు

కొంపల్లి, మే 6, ప్రభాతవార్త : చాలా మంది వాహనదారులు ప్రమాదం అని తెలిసినా కూడా రాంగ్ రూట్లో వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వారితో పాటు ఇతరులకు ఇబ్బందులు కల్పిస్తు న్నారు. సోమవారం రాంగ్‌రూట్‌లో వసు న్న వాహనదారులను మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.ప్రశాంత్ ఆధ్వ ర్యంలో తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విఎన్ఆర్ కాలేజీ దగ్గర రాంగ్ రూట్‌లో వస్తున్న 10 ద్విచక్ర వాహనాలను, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల హెచ్‌డిఎఫ్‌సి యుటర్న్ లేబర్ అడ్డా దగ్గర రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనాలను పట్టుకుని మియాపూర్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు.

**IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XI ADDITIONAL DISTRICT JUDGE, BARKATPURA, AT: L.B. NAGAR**
**M.V.O.P.NO.85 OF 2022**

BETWEEN:
**CHERUKU BIKSHAM** ...PETITIONER
AND
**Mrs. CHAITHANYA KOPPOLU And others** ...RESPONDENTS
To
**R-3 Shaik Javeed @ Moizuddin,** S/o Sk. Moinuddin, Aged about 40 years, Occ: Driver of Car B.No.TS 07 GF 3794, R/o H.No.7/A, Sony S. Sai Arcade, HUDA Colony, Kothapet, Ranga Reddy District.

**NOTICE**

The Petitioner herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1989 and Rule 475/1B of A.P.M.V. Rules, 1989, against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above OP and the matter is posted to **27.05.2024 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
**Sd/- Y. SRINIVAS GUPTA**
**Advocate**
3-4-141/11, Dolphin Lane, Barkatpura, Hyderabad.

**BEFORE THE COURT OF HONORABLE DEBTS RECOVERY TRIBUNAL-II AT HYDERABAD**
**O.A NO: 477 of 2023**

Between:
**BANK OF BARODA** ...APPLICANT
And
**M/s SURYA PLOYMERS** ...DEFENDANTS
To,
**1. M/S SURYAPOLYMERS** rep by its Proprietor Bairugadda Sangeetha Rao, D.No: 20, Industrial Estate, Medchal District Hyderabad 501401
**2. Bairugadda Sangeetha Rao,** D.No: 24-649, Ranga Reddy Nagar, Opp. IDPL Colony, Bala Nagar, Hyderabad 50
***Alternate address***
**Bairugadda Sangeetha Rao,** H.No: 1-728/C213, Mangalagiri, Guntur Andhra Pradesh 522503

Please take notice that the applicant has filed the above O.A for recovery of money. The above said case is posted to **22-05-2024 at 10.30 A.M.** in the above Court. The Defendants may approach this Honorable Court with valid documents either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// BY ORDER OF THE COURT//
**T.S.S. KRISHNA**
OFF: H.No.8-3-167/A/29, Vikaspuri colony, near A.G's colony , Hyderabad-500038
**Mobile; 7396970010,**
**E-mail: tsskrishna@gmail.com**

**IN THE COURT OF THE HON'BLE VI ADDL. METROPOLITAN MAGISTRATE-CUM II ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT L.B.NAGAR**
**O.S.No.308 of 2024**

BETWEEN:
**B.K. Praveen Kumar and others** ...Plaintiffs
And
**The Tahsildar,** Uppal Revenue Mandal, Medchal-Malkajgiri District. ...Defendants
To,
**All CONCERNED** ...Defendant No.2

Please take notice that the above named Plaintiffs filed the above case seeking Declaration Declaring the Plaintiffsare the Legal Heirs and Successors of Late Smt. B.Shakunthala Devi W/o Late B.Krishna Rao that Plaintiff No.1 is the absolute owner and possessor of the suit schedule property against you and another and the same is posted, to **28-06-2024 at 10.30 a.m.** before the above said Hon'ble Court for objections from all the concerned. Any persons having objections may appear in the above case on the above said date and time before the above said Hon'ble Court and submit objections. If No Objections are received in the above case on the above said date and time the matter will be decided on merits.

**SCHEDULE OF PROPERTY**

All that the Open Land bearing Plot No.191, admeasuring 200 Sq. yards, in Sy.Nos. 76/6 to 76/16, situated at Dwaraka Nagar Colony, Phase-II, Chengicherla Village and Gram Panchayath, Ghatkesar Mandal, Ranga Reddy District, presently Medchal-Malkajgiri District and bounded by:- NORTH:: Plot No.190, SOUTH:: Plot No.192, EAST:: 25' feet wide Road, WEST:: Plot No.179.

//BY ORDER OF THE COURT//
**M/s. DEEKONDA RAVINDER**
**ADVOCATES**
Flat No.104, Ist Floor, Lorven Complex Chaitanyapuri, DSNR, Hyderabad - 60.
**Phone No. 9848041225**

**IN THE COURT OF THE HON'BLE XI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, HYDERABAD**
**Arb. O.P. No. 143 OF 2023**

Between:-
**Svobodha Infinity Investment Advisors Pvt. Ltd.,** ...PETITIONER
AND
**M/s. Bold Deals** (Partnership Business) Rep.by its Partners and another. ...RESPONDENTS

**NOTICE**

To
**1. M/s. Bold Deals** (Partnership Business), Having its Regd. Office at H.No. 7-1-396/D/101/a, Flat No. 101, Siddartha Vysali Apartment, S.R. Nagar, Ameerpet, Hyderabad-500 038. Represented by its Partner, **Smt. Chillara Suvarchala Devi** W/o. Chillara Venkata Ramakrishna, Aged about 46 years, Occ: Business, R/o. H.No.7-1-396, Flat No.302, Siddartha Vysali Apartment, S.R. Nagar, Ameerpet, Hyderabad-500 038
**2. Sri Chillara Venkata Ramakrishna** S/o. Not Known to Petitioner, Aged Major, Occ: Business, R/o. H.No. 7-1-396, Flat No.302, Siddartha Vysali Apartment, S.R. Nagar, Ameerpet, Hyderabad-500 038
Sirs,
Please take notice that in the above O.P., summons were sent to your above address, which are returned un-served. Please take notice that the above O.P. is now posted to **21-06-2024.** You are to appear before the above Court on the above date at 10.30 a.m. either personally or through duly instructed advocate, failing which matter will be decided as per law in your absence.

By order of the Court
**Sd/- SANKALP PISSAY**
**Advocate,**
3-1-473,
Sri Ambika Krupa,
Nimbolidadda, Kachiguda,
Hyderabad.

**IN THE COURT OF THE II ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**O.S. No: 213 OF 2024**

Between:
**1] Smt. Yerramilli Naga Lakshmi Kumari,** w/o Late Sri Yerramilli Siva Rama Krishna Rao, Age :73 years, Occ. Retired, Aadhar No: 5883 4210 5273
**2] Sri YerramilliVekata Siva Satyanarayana** Murthy, S/o Late Sri Yerramilli Siva Rama Krishna Rao, Age: 54 years, Occ. Private Service, Aadhar No: 9128 2240 1738.
Both R/o H.No:1-19-86/91/1,Ashok Manipuri, Near Lalitha Devi Temple, Kapra, ECIL, Hyderabad, Telangana-500062 ...Plaintiffs
And
**1] Greater Hyderabad Muncipal Corporation,** Circle No:14, BarkatPura, Hyderabad.
**2] Greater Hyderabad Muncipal Corporation,** Circle No;1, Kapra, ECIL, Hyderabad.
**3] The Mandal Revenue Officer Shamshabad.**
**4] Sri. Y, Srivatsa** S/o.Late Sri YSK Murthy, Aged: 60 Years, Occ: Architect, B-402, H.No: 1-2-597/36,SVSS Sankalp, Indira Park Road, Next to HP Petrol Bunk, Hyderabad -500080.
**5] All concerned** ...Defendants

**NOTICE**

To,
All concerned.
Whereas the above named plaintiffs have filed the above suit OS.No. 213/2024 on the file of II Addl Chief Judge, City civil court at Hyderabad against all concerned seeking the relief of declaration to declare that the plaintiffs are the legal heirs ofLate Sri Yerramilli Siva Rama Krishna Raoand entitled to succeed the estate left behind by him i.e.,

**SCHEDULE 'A' PROPERTY**

All that property being Flat No.106, admeasuring 860 Sq Feet or 79.92 Sq.Meters along with garage space No.6 admeasuring 160 Sq Feet or 14.86 SqMts Situated at MCH No: 3-4-802, Barkat Pura , Hyderabad and bounded as follows: North: Passage and Flat No.105, South: Internal Road, East: Internal Road, West: Flat No.107
[Garage Boundaries:N-Passage, S-Drive way, E-Garage Spaceno 7, w-Garage spaceno.5]

**SCHEDULE 'B' PROPERTY**

All that property being Residential Plot No.91, In Survayno; 558 Part,, 559, 560, 563 and 564 admeasuring 182 Sq yards or 152.15 Sq.Meters, vide House Bearing No.1-19-86/91/1,2300sft Ground plus two floors Situated at Ashok Manipuri Under KapraMuncipality , KeesaraMandal,covered under Block No 19 and bounded as follows: North: Plot No.30, South: Neighbour's Plot, East: 30'Wide Road, West: Plot No.92.

**SCHEDULE 'C' PROPERTY**

All that property being plot No. 50, admeasuring about 500 sq. yards equivalent to 418.41 Sq.meters in Sy.No.415, in Millinium Park, Sector-II situated at Shamshabad village and Mandal, Ranga Reddy district, and bounded as follows: North: 30' Ft wide Road, South: Plot no.44, East: Plot no.49, West: 30' Ft wide Road.
The Honorable Court has posted the matter to **28-06-2024** for objections, if any. If any person or persons have any claim/objection in respect of grant of relief of declaration in favour of the plaintiffs and/or in respect of the suit schedule properties, they are hereby required to appear before Hon'ble II Addl Chief Judge, City civil court, at Hyderabad on **28-06-2024 at 10.30 A.M** with supporting documents, if any, as otherwise the court would proceed to grant the relief prayed for.

(ISSUED UNDER THE ORDERS OF THE COURT)
**S. RAMAKRISHNA, Advocate**
OFF: Flat No 253, 5th Block, Jana Priya Abodes, Gandhi Nagar, Hyderabad-500080. **Cell: 9246542094**

# 9వ తేదీ నుంచి అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలు

## ఇష్టి బ్రహ్మోత్సవాలకు లక్ష మంది తరలివచ్చే అవకాశం



అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాల పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న దేవాలయం కమిటీ సభ్యులు

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం 28వ ఇష్టి సహిత బ్రహ్మోత్సవములు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ సోమ సురేష్, ప్రధానకార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐత అంజయ్యగుప్తాలు తెలిపారు.

### విస్తృత ఏర్పాటు చేసిన దేవాలయ కమిటీ

అష్టలక్ష్మి దేవాలయం ఆవరణలో సోమవారం దేవాలయం కమిటీ సభ్యులు అష్టలక్ష్మి 28వ ఇష్టి సహిత బ్రహ్మోత్సవాల పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజులపాటు దేవాలయం ఆవరణలో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి ముమ్మర ఏర్పాట్లు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు నగరంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన లక్ష మందికిపైగా భక్తులు హాజరవుతారని తెలిపారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను నూతన పద్ధతి ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలలో ఐదు రకాల ఇష్టిలతో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని కాపాడడంతోపాటు నేటి యువతకు ఆధ్యాత్మికతను తెలియజేయడానికి విస్తృత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయంలో అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతోపాటు దేదీప్యమానంగా తీర్చిదిద్దామన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు భక్తులకు మజ్జిగ, మంచినీరు, భోజన వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కన్వీనర్ బొగ్గరపు రవీందర్, అన్నదాన కమిటీ సెక్రటరీ మ్యాడం సుధాకర్ గుప్తా, నాగమల్ల శ్రవణ్‌కుమార్, గౌరిశెట్టి అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఎస్‌వివి.సత్యనారాయణ, శ్రీధర్, శ్రీనివాస్, ఉమాపతి పాల్గొన్నారు.

# మురుగునీటితో చెరువుగా మారిన కొత్తపేట రోడ్డు

## కొత్తపేట గ్రామంలో మురుగునీటి దుర్గంధం -మురుగునీటి మధ్య స్థానికుల సహవాసం

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: ములుగునీరు రోడ్డుపై పొంగి పొర్లుతుండడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాదచారుల పరిస్థితి మరి దయానయంగా తయారయింది. గత నాలుగు రోజులుగా మురుగునీరు రోడ్డుపై పొంగిపొర్లుతుండగా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. కొత్తపేట గ్రామంలోని ప్రధానరోడ్డుపై మురుగునీరు పొంగుపొర్లి ఆ ప్రాంతం పూర్తిగా దుర్గంధంగా మారుతున్నప్పటికీ జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట నుంచి మారుతినగర్ వరకు మురుగునీటి ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మురుగునీటితో కొత్తపేట ప్రధానరోడ్డు చెరువును తలపిస్తోంది. ఆ దారి గుండా ప్రయాణించే వాహన శోధకులు బాటసారుల పరిస్థితి దయానియంగా తయారయింది. చెరువును తలపించే మురుగునీటిలో నడవడం పాదాచారులకు నరకంగా మారింది. రోడ్డు మొత్తం మురుగు నీటితో నిండడం వల్ల అడుగు తీసి అడుగు వేయలేని దుర్భర పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలలో తమ పార్టీకి ఓట్లు వేయాలని నిర్వహిస్తున్న రాజకీయ పార్టీలకు నాలుగు రోజులుగా రోడ్డుపై ఉన్న మురుగునీటి సమస్య కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఓట్లు కావాలని తిరుగుతున్న రాజకీయ పార్టీల నాయకులకు రోడ్డుపై ఉన్న మురుగునీటి ప్రవాహం కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి ప్రవాహంతో తాము పడుతున్న ఇబ్బందుల గురించి జలమండలి అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన ఎందుకు పట్టించుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఫిర్యాదు చేసినా పట్టించుకోని జలమండలి అధికారులు



మురికి కుపంగా మారిన రోడ్డు

**సమస్యలు పట్టించుకోరా...** నాలుగు రోజులుగా తాము నరకయాతన అనుభవిస్తున్న అధికారులు రాజకీయ పార్టీల నాయకులు సమస్యలు పట్టించుకోరా అని కొత్తపేట గ్రామనివాసి పి.గోపాల్‌యాదవ్ ప్రశ్నించారు. అడుగు తీసి అడుగు వేయలేని దుర్భర పరిస్థితుల్లో తాము ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ నుండి మీర్‌పేట్ మహిళా కార్పొరేటర్ బాలమణి సస్పెండ్



సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మీర్‌పేట్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ కార్పొరేటర్, సీనియర్ బిఆర్ఎస్ నాయకురాలు బైగళ్ళ బాలమణిని పార్టీ నుండి సస్పెండ్ చేశారు. జిల్లెలగూడలో పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో బాలమణిని బిఆర్ఎస్ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీ ద్వారా కార్పొరేటర్‌గా గెలిచి పార్టీలో ఉంటూనే ఇటీవల కాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నందుకు ఆమెను పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందని కామేష్‌రెడ్డి వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇక నుండి ఆమెకు పార్టీకి ఎటువంటి సంబంధం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మేకల రవీందర్‌రెడ్డి, నాయకులు సిద్దాల పెద్ద బీరప్ప, సిద్దాల అంజయ్య, మాదరి రమేష్, గడ్డమీది లక్ష్మణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రియాంకశుక్ల, పంకజ

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై ఎన్నికల అధికారులు సోమవారం పరిశీలన జరిపారు. మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎల్.బి.నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కి సంబంధించి ఐఏఎస్‌అధికారి, జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్ల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ మాక్ పోల్, ఈవియంల కమిషనింగ్, సింబల్ లోడింగ్, పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్‌రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు పల్లె జంగయ్యగౌడ్, ఎరుకల మంగ రవిగౌడ్‌లు గుడ్ బై

## తమ వర్గీయులతో కలిసి కాంగ్రెస్‌లో చేరిక



తీగల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎరుకల మంగ రవిగౌడ్ తదితరులు

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: మహేశ్వరంనియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బిఆర్ఎస్ కో-ఆప్షన్ సభ్యుడు, సీనియర్ నేత పల్లె జంగయ్యగౌడ్, సరూర్‌నగర్ మండల పరిషత్ మీర్‌పేట్ మాజీ ఎంపిటిసి ఎరుకల మంగ, సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు ఎరుకల రవిగౌడ్, నంది హిల్స్ నాయకుడు మట్లా సత్యనారాయణగౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. పల్లె జంగయ్యగౌడ్, మట్టా సత్యనారాయణగౌడ్‌లు మీర్‌పేట్ 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చేవెళ్ళ సిట్టింగ్ ఎంపి, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా ఎరుకల మంగ, రవిగౌడ్‌లు మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, తీగల సాయినాథ్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, వజ్రోజు రవీంద్రచారి, జటావత్ రవినాయక్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పార్టీలో చేరిన కార్పొరేటర్ బాలమణి



కాంగ్రెస్‌లో చేరి రంజిత్‌రెడ్డిని కలిసిన బైగళ్ళ బాలమణి, ఓం ప్రకాశ్‌లు

సరూర్‌నగర్,మే 6 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 19వ డివిజన్ కార్పొరేటర్, స్థానిక జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్ దళిత సీనియర్ నాయకురాలు బైగళ్ళ బాలమణి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కృతురాలైన ఆమె తన కుమారుడైన యువ దళిత నాయకుడు బైగళ్ళ ఓం ప్రకాశ్‌తో పాటు పెద్ద సంఖ్యలో యువకులతో కలిసి మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు, కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, సరూర్ నగర్ మాజీ జడ్పీటిసి, సీనియర్ నాయకుడు జిల్లెల నరేందర్‌రెడ్డి, మండల ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథల సమక్షంలో ఆమె హస్తం గూటికి చేరారు. జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి బొబ్బిలి కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ మేడిబావిలోని టికెఆర్ క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన వారికి తీగల కృష్ణారెడ్డి మూడు రంగుల కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరక ముందు బాలమణి మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వద్దకు వెళ్ళి కలవడం గమనార్హం.

**రంజిత్‌రెడ్డిని కలిసిన బాలమణి, ఓం ప్రకాశ్‌లు...** హస్తం గూటికి చేరిన కార్పొరేటర్ బాలమణి ఆమె కుమారుడు ఓం ప్రకాశ్‌లు చేవెళ్ళ సిట్టింగ్ ఎంపి, కాంగ్రెస్‌అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని కలిసారు. నగరంలోని ఆయన నివాసానికి తరలివెళ్ళి వారు అక్కడ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి వారి చేరికను స్వాగతించి అభినందించారు.

# ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యం


## : బీసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న



బీసి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ సంఘం సభ్యులు

నేరెడ్‌మెట్, మే 6 ప్రభాతవార్త : ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమం కోసం బీసి డి నుండి బీసి ఏ లోకి మార్చేంత వరకు ముదిరాజ్‌లతో పోరాటం నిర్వహిస్తామని మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభల అధ్యక్షులు సాంబరాజ్ డిమాండ్ చేసారు. సోమవారం మల్కాజిగిరి పరిధిలోని ఓల్డ్ సఫిల్‌గూడ మౌలాలిలో చెరుకు సాంబరాజు అధ్యక్షతన ముదిరాజ్ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీసి కులాల ఐక్యవేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనాభ 4కోట్లకు పైగా జనాభా ఉంటే అందులో ముదిరాజ్‌లు 14శాతం పైన సుమారు 60లక్షల మంది వరకు ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రభుత్వ జీవో ద్వారా ముదిరాజ్‌లను బీసి ఏలోకి మార్పు చేయాలని, ముదిరాజ్ సంక్షేమ పథకాలను కూడా అమలు చేయాలని చెరువు సాంబరాజు ముదిరాజ్ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి దండు ప్రసాద్, శివంది, ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కట్టెల బిక్షపతి, దేవరాజ్, జనార్ధన్, బతిక మల్లయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజుకు ఘన సన్మానం



పాస్టర్ సిహెచ్.ఎస్ రాజును సన్మానిస్తున్న సహచర పాస్టర్లు

నాచారం, మే 6 ప్రభాతవార్త : మల్లాపూర్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఐనోన్ చర్చి పాస్టర్ సి.హెచ్.ఎస్.రాజును సంఘం సభ్యులు, మత పెద్దలు,క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సత్కారించారు. కేక్ కట్ చేసి శాలువాలు, బోకేలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ధనరాజు, బ్రహ్మయ్య, యోహాన్, రవీందర్, మనోజ్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# బాక్స్‌డ్రెయిన్‌ను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదు : కార్పొరేటర్ దర్పల్లి



బాక్స్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, మే 2 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియ కాలనీ నుంచి వడ్డెర బస్తీ వరకు సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దాదాపు మూడున్నర సంవత్సరాల క్రితం జనప్రియ కాలనీ నుంచి వడ్డెరబస్తీ వరకు బాక్స్ డ్రెయిన్‌ను జిహెచ్ఎంసి నిధులతో నిర్మించడం జరిగింది. అయితే కొద్ది రోజులుగా వైఎస్ఆర్ గార్డెన్ వెనుక వైపు భూ యజమాని జిహెచ్ఎంసి నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను కాదని తమకు అనుకూలంగా ఉండేలా తానే స్వంతంగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నారని దీని వల్ల గతంలో వలె దాదాపు 22 కాలనీలు వరదముంపుకు గురయ్యే ప్రమాదముందని ఆయా కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేపడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను తొలగిస్తే ఊరుకునేది లేదని, గతంలో సదరు యజమాని ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. బాక్స్ డ్రెయిన్ పక్క నుంచి 30 ఫీట్ల రోడ్డును నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనప్రియ అపార్ట్‌మెంటు వాసులు, సాయినగర్ కాలనీ, వెడ్డెర బస్తీ, భాగ్యనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

హయత్‌నగర్, మే 6 ప్రభాతవార్త: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామం సర్వేనెంబరు 85 ఈర్లగుట్టలో కొంతమంది ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈర్లగుట్టలో 15 సంవత్సరాల క్రితం పట్టాలు పొందిన 20 కుటుంబాలు ఇళ్ల నిర్మాణం చేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. కాగా పక్కనున్న ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని ఇళ్లున్న కొంత మంది ఆక్రమించి ఎలాంటి సర్టిఫికెట్లు లేకున్నా అక్రమంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపి ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు.

# ఓబీసీలకు బిజెపి ప్రాధాన్యత : చింతల




సమావేశంలో మాట్లాడుతున్న చింతల సురేంద్రనాథ్‌యాదవ్

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: ఓబీసీలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి అధిక ప్రాధాన్యత ఇస్తుందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్‌లోని అనంతల రాంరెడ్డి గార్డెన్‌లో ఎల్బీనగర్ నియోజకవర్గం స్థాయి ఓబిసి సామాజిక సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మోడీని మరొకసారి ప్రధానమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దేశం అభివృద్ధి కొరకు మరొకసారి ఓబీసీలు మోడీని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబిసి మోర్చా ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు పొల్కం ప్రశాంత్‌ముదిరాజ్, ఎల్బీనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ రవీందర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడి అరెస్ట్



చోరీలకు పాల్పడతున్న నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డిసిపి పద్మజ, ఎసిపి చక్రపాణి తదితరులు

ఉప్పల్, మే 6 ప్రభాతవార్త : తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఒక పాత నేరస్థుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సోమవారం మల్కాజిగిరి ఎసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. మల్కాజిగిరి డిసిపి పద్మజారెడ్డి, ఎసిపి ఎస్.చక్రపాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన శెట్టి వెంకటరమణ 50 సంవత్సరాలు గత 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బాలానగర్‌లో ఉంటూ స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. జనగామకు చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుని అక్కడే ఉంటున్నాడు. గతంలో ఏపి, తెలంగాణలోని సుమారు 250 చోరీ కేసులలో ఇతను నిందితుడని తెలిపారు. గతంలో సైబరాబాద్ సివి ఆనంద్ కమిషనర్‌గా ఉన్న సమయంలో మైత్రి పథకం కింద ఉప్పల్ చౌరస్తాలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేయించారని, మూడు, నాలుగు సంవత్సరాలు టిఫిన్ సెంటర్ నడిపిన తర్వాత తిరిగి చోరీలకు అలవాటు పడినట్లు తెలిపారు. గత ఏడాది ఏప్రిల్‌లో నల్లగొండ జిల్లా పోలీసులకు పట్టుబడి జైలు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. తిరిగి గత నెల 26వ తేదిన జోడిమెట్ల స్వర్ణగిరి కాలనీలో బి.స్వాతి ఇంటికి తాళం వేసి డ్యూటికి వెళ్లగా తాళం పగులగొట్టి 14 తులాల బంగారం, 28 తులాల వెండి చోరీ చేసి పరారైనట్లు తెలిపారు. నిందితుడు దొంగతనాలు చేసే సమయంలో రూపురేఖలు మార్చుకుని పగటిపూట వివిధ ప్రాంతాల్లో కాలినడకన తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపి చేసుకుని చోరీలకు పాల్పడుతాడని తెలిపారు. ఇదే క్రమంలో పోచారం ఐటిసి పోలీసులు జోడిమెట్ల చౌరస్తా వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 21 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.లక్షన్నర నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డిసిపి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎసిపి ఎస్.చక్రపాణి, సిఐ బి.రాజు, డిఇ జె.శ్రీనివాస్, టిఎస్ఐ వి.యుగేందర్ తదితరులు నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

# పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనకు కృషి : కమిషనర్ సత్యనారాయణరెడ్డి



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న కమీషనర్ సత్యనారాయణరెడ్డి తదితరులు

తుర్కయంజాల్, మే 6 ప్రభాతవార్త : తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలని పురకమీషనర్ సత్యనారాయణ రెడ్డి సోమవారం సిబ్బందిని ఆదేశించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ, తొర్రూరు, మునగనూరు, బ్రాహ్మణపల్లి, తుర్కయంజాల్ పోలింగ్ స్టేషన్లో అవసరమగు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల విధుల కోసం వచ్చే సిబ్బందికి అవసరమగు త్రాగు నీరు, టాయిలెట్లు, టెంట్ హౌస్ సామాగ్రి, ఎలక్ట్రిక్ మరమ్మత్తులపై కమీషనర్ సమీక్షించారు. ఎన్నికల దృశ్య మే 13వ తారీకు వరకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్ పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బిల్ కలెక్టర్లు ఎల్లయ్య, నరేష్, వర్క్ ఇన్స్ పెక్టర్లు శివలింగం, జగదీష్, మహేష్, జవాన్లు మురళి, నాగేష్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# తమ ప్లాట్లను తమకు ఇవ్వాలని యజమానుల ఆందోళన

హయత్‌నగర్, మే 6 ప్రభాతవార్త: అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్వతంత్ర సమరయోధులకు కేటాయించిన భూమికి ఎన్‌ఓసీలు ఇప్పించడమే కాకుండా పక్కనున్న తమ ప్లాట్లను ఆక్రమించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్లాట్ల యజమానులు సోమవారం ఆందోళనకు దిగారు. వివరాలు... పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల గ్రామ సర్వేనెంబర్ 106/2లో వీరమాచినేని నారాయణరావుకు ప్రభుత్వం స్వతంత్ర సమరయోధులకోటాలో 7 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దానిపై కన్నేసిన బూరనర్సయ్యగౌడ్ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల ద్వారా భూయజమానుల పేరుతో ఎన్‌ఓసీ మంజూరు చేయించారు. అనంతరం దానిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేశాడు. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల మద్ధతుతో దానిని ధరణిలో ఎక్కించడంతో పాటు హెచ్‌ఎండీఏ అనుమతులు కూడా మంజూరు చేయించారు. ఇదిలా ఉండగా... 106/2 పక్కనే ఉన్న 87,88 సర్వే నెంబర్ల లోని 24 ప్లాట్లను సైతం లే-అవుట్‌లో కలిపేశారు. దీనిపై ప్లాట్ల యజమానులు కోర్టుకు వెళ్లగా... వారికి ప్లాట్లను ఇస్తానని నమ్మబలికాడు. అయితే... ఇప్పటివరకు వారి ప్లాట్లను ఇవ్వడంలేదు. తమ ప్లాట్లను ఇవ్వకుండా మోసం చేస్తున్న బూరనర్సయ్యగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు.

# ఉప్పల్‌లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



ఉప్పల్ స్టేడియంలో జిహెచ్ఎంసి వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ పంకజ, డిసి అంజనేయులు తదితరులు

ఉప్పల్, మే 6 ప్రభాతవార్త : శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ పంకజ పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో జిహెచ్ఎంసి ఈస్ట్ జోన్ వేసవి శిక్షణ శిబిరాలను ఉప్పల్ డిసి అంజనేయులు, కాప్రా డిసి పి.ముకుందరెడ్డి, హయత్‌నగర్ డిసి టి.యాదయ్య, ఎల్‌బినగర్ డిసి జకియా సుల్తానా, సరూర్‌నగర్ డిసి సుజాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులను తయారు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అన్ని ప్రాంతాల్లోని క్రీడాకారులకు వివిధ సదుపాయాలు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.